క్లుప్తంగా

చేనేత కార్మికులకు చెక్కుల పంపిణీ



చెక్కులను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని ఉరవకొండ చేనేత పారిశ్రామికుల సంస్థలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత బ్లాక్ లెవెల్ క్లస్టర్ చైర్మన్, జిల్లా ఖాదీ శిల్క్ సహకార సంస్థ చైర్మన్ కొత్త శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్మికులకు మహాత్మాగాంధీ బుంకర్ బీమా యోజన పాలసీ చెక్కులు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉరవకొండలోని చేనేత బ్లాక్ లెవెల్ క్లస్టర్ కార్మికుల సంక్షేమానికి, వారిలో నైపుణ్యత పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం 290 మంది క్లస్టర్ చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి 180 చొప్పున 52,200 విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. దీంతో పాటు చేనేత మార్క్‌ను మాజీ ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం క్లస్టర్ చైర్మన్ కొత్త శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేను ఖాదీ వస్త్రాలతో సత్కరించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

బ్రహ్మసముద్రం: మండలంలోని నాగిరెడ్డిపల్లి మెయిన్ అంగన్ వాడీ కేంద్రాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటరమణ సోమవారం తనిఖీ చేశారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. పిల్లల హాజరు, గర్భిణులు, బాలింతల హాజరు శాతాన్ని తనిఖీ చేశారు. స్టాక్ వివరాలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ ద్వారా అందించే పౌష్టికాహారం పంపిణీపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన చిన్నారులతో కలసి భోజనం చేశారు. అనంతరం ఆయన పిల్లల హాజరు రికార్డులు సరిగాలేదని సిబ్బందిపై మండిపడ్డారు. అంగన్‌వాడీ కేంద్రంలో నాణ్యమైన ఆహారం అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు, ఐసీడీసీ సూపర్‌వైజర్లు కాసీంబీ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మతోన్మాదం నశించాలి



ర్యాలీ చేస్తున్న పాస్టర్లు

రాయదుర్గంటౌన్: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు, చర్చిలను తగలబెడుతున్న నిరంకుశత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తూ రాయదుర్గం నియోజకవర్గంలోని క్రైస్తవులు కదం తొక్కారు. సోమవారం రాయదుర్గం పట్టణంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నియోజకవర్గ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో భారీసంఖ్యలో క్రైస్తవులు హాజరై శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైటాయించి మణిపూర్ ఘటనను ఖండిస్తూ పాస్టర్లు ప్రసంగించారు. మణిపూర్‌లో శాంతినెలకొల్పి మానవత్వాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

డి హీరేహాళ్ రహదారికి మహర్దశ



భూమిపూజలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండల కేంద్రంలో బళ్లారి– బెంగళూరు జాతీయ రహదారి నుంచి ఎస్సీ కాలనీ మీదుగా హిర్దేహాళ్ గేట్‌కు చేరే ప్రధాన రహదారి దారుణంగా దెబ్బతిని ప్రయాణికుల పాలిట నరక ప్రాయంగా మారింది. ఇటీవల గ్రామ పర్యటనకు వచ్చిన విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి ఎస్సీ కాలనీ వాసులు సమస్యను తీసుకెళ్లారు. సత్వరం స్పందించిన విప్ కాపు ఎమ్మెల్యే నిధుల ద్వారా రూ.40 లక్షలు మంజూరుచేశారు. ఆ నిధులతో సోమవారం స్థానిక సర్పంచ్ హెచ్ లక్ష్మి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, మండల కన్వీనర్ ఎమ్ వన్నూర్‌స్వామి, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి లు భూమిపూజ చేపట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ బసవకుమార్, ఎస్‌ఐ రంగడుయాదవ్, ఈఓఆర్డీ బలరామ్, సర్పంచులు శ్రీనివాసరెడ్డి, పరమేష్, మల్లికార్జున, ఎంపీటీసీలు కల్యాం సురేష్, గోవిందు, సూజీ మహేష్, ఎర్రిస్వామి, వైస్ సర్పంచ్ కరిడి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- రూ.41 కోట్ల నిధుల మంజూరుకు కృషి చేసిన విప్ కాపు రామచంద్రారెడ్డి
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు



గుమ్మఘట్ట మండలం ఎర్రంపల్లి వద్ద పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

రాయదుర్గం : నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కృషితో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. నియోజకవర్గంలోని డి హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరందించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐదు మండలాల్లోనూ 84 గ్రామ పంచాయతీలు, 153 మజరా గ్రామాలు ఉన్నాయి. మొదటి దశలో 114 గ్రామాల్లో నీటి పథకాన్ని పునరుద్ధరించారు. వైఎస్సార్ మరణాంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ఆ పథకాన్ని అటకెక్కించింది. అప్పట్లో రాయదుర్గం ఎమ్మెల్యేగా, రాష్ట్రానికి మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన కాలవ శ్రీనివాసులు మిగిలిన 39 గ్రామాలకు నీరందించడంలో విఫలమయ్యారు. ఫలితంగా స్వచ్ఛమైన తాగునీటి కోసం వేలాది మంది ప్రజలు ఎదురుచూపులకే పరిమితమయ్యారు. పక్క గ్రామాలకు శ్రీరామిరెడ్డి తాగునీరొస్తున్నా, తమకు మాత్రం అందడం లేదని 39 గ్రామాల ప్రజలు ఆవేదన చెందారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లిన విప్ కాపు రామచంద్రారెడ్డి ఈ విషయాన్ని ప్రధాన సమస్యగా గుర్తించారు. సంబంధిత అధికారులతో ఎస్టిమెంట్లు సిద్ధం చేయించుకుని సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి నేరుగా తీసుకెళ్లారు.

రూ.41 కోట్ల నిధులు మంజూరు

విప్ కాపు విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.41 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ టెండర్లను నార్ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి చెందిన ప్రతినిధి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా బొమ్మనహాళ్ మండలం కానాపురం, కొత్తూరు, నేమకల్లు, డి హీరేహాళ్ మండలం చెర్లోపల్లి, డి హీరేహాళ్, హెచ్‌ఎస్ తాండా, హులికల్లు, కల్యం, హిర్దేహాళ్, జాజరకల్లు, బాదనహాళ్, హడగలి, కాదలూరు, లక్ష్మిపురం, మడెనహళ్లి, లింగమనహళ్లి, మలపనగుడి, నాగలాపురం, తిమ్మలాపురం, ఓబుళాపురం, హొసగుడ్డం, పులకూర్తి, సాములాపురం, గుమ్మఘట్ట మండలంలోని వై గుండ్లపల్లి, భూపసముద్రం, ఎర్రంపల్లి, అడిగుప్ప, జే వెంకటంపల్లి, కలుగోడు, హొసల్లి, గొనికుంట, రాయదుర్గం మండలంలోని చదం, చదం గొల్లలదొడ్డి, మల్లాపురం, తాండా, మెచ్చిరి, పల్లెపల్లి మొత్తం 39 గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన పనులు మొదలు పెట్టారు. నీటి పథకం పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేసి పైప్‌లైన్ తవ్వకం పనులను ఇటీవల ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్, డీఈ స్టాలిన్ ల ఆధ్వర్యంలో ఎర్రంపల్లి వద్ద ప్రారంభించారు. దీంతో గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనులు మొదలయ్యాయి



నియోజకవర్గంలోని 39 గ్రామాల్లో శ్రీరామిరెడ్డి పథకం ద్వారా నీరిందించే ప్రక్రియ వేగవంతం చేశాం. అన్నీ గ్రామాల్లోనూ మట్టి పనులు మొదలయ్యాయి. సకాలంలో పనులు పూర్తిచేసేలా కాంట్రాక్టర్‌ను ఒప్పించాం. కావాల్సిన సామగ్రి కూడా అన్ని గ్రామాల్లోనూ సిద్ధం చేశాం. పనులు పూర్తయితే గ్రామీణులకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి.

\- స్టాలిన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, రాయదుర్గం

అన్ని గ్రామాలకు శ్రీరామరెడ్డి తాగునీరు



నియోజకవర్గం లో అన్నీ గ్రామాలకు శ్రీరామరెడ్డి తాగునీరందించలాని లక్ష్యంగా పెట్టుకున్నాం. గత టీడీపీ హయాంలో ఈ పథకాన్ని పూర్తి నిర్వీర్యం చేస్తే సీఎం జగన్ సమర్థవంతంగా నడిపిస్తూ పేదల దాహార్తి తీర్చుతున్నారు నియోజకవర్గంలో 39 గ్రామాల ప్రజల ఇబ్బందులు తెలియజేయగానే పెద్దమనసుతో రూ.41 కోట్ల నిధులు మంజూరుకు ఉత్తర్వులు జారీ చేశారు.

\- కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

సంతోషంగా ఉంది



తాగునీటి సమస్యనుగత పాలకులకు పలుమార్లు విన్నవించినా పరిష్కరించలేకపోయారు. మా గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేసిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలును ఎప్పటికి మరచిపోలేం. జీవితాంతం గుర్తించుకుంటాం.

\- రాజేష్, అడిగుప్ప, గుమ్మఘట్ట మండలం

నేడు మంత్రి సమీక్ష సమావేశం

కళ్యాణదుర్గం: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల బీఎల్‌ఏలు, జేసీఎస్ మండల కన్వీనర్లతో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

నేడు మండల సమావేశం

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాలమాన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

పిల్లలందరూ బడిలో ఉండాలి

శెట్టూరు: బడి బయట ఉన్న పల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ శ్రీధర్, ఈఓఆర్డీ రఘురామారావు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని సచివాలయల వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహిచారు. 5 – 15 సంవత్సరాల మధ్య వయస్సున్న పిల్లలు బడిలో ఉండేలా వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు చర్యలు చేపట్టాలన్నారు. 10వ తరగతి ఫెయిల్ అయిన పిల్లలు తిరిగి అదే తరగతిలో పాఠశాలలో తప్పనిసరిగా చేరాలన్నారుకార్యక్రమంలో వెల్ఫేర్, సీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలి

కళ్యాణదుర్గం: భూమిలేని నిరుపేదలు రెండు ఎకరల చొప్పున ఇవ్వాలని, గ్రామాల్లో దళితవాడలకు ప్రత్యేక శ్మశానవాటికలు ఏర్పటు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓకు వినత పత్రం అందజేశారు.

మాజీ సర్పంచ్‌కు ఘన నివాళి



మాజీ సర్పంచ్ వీరారెడ్డి పాడె మోస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

బ్రహ్మసముద్రం: మండంలోని గుండిగానీపల్లి మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అప్పన్నగారి వీరారెడ్డి(90) ఆదివారం మృతి చెందారు . విషయం తెలుసుకున్న రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ వీరారెడ్డి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, పాడె మోసారు. అనంతరం ఆయన వీరారెడ్డి సేవలను గుర్తుచేశారు. గుండిగానిపల్లిలో హైస్కూల్ ఏర్పాటు చేయడం కోసం ఐదు ఎకరాలు దానం చేశారన్నారు. ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బసవరాజు, సర్పంచ్ సుజాతమ్మ , వీరశైవ లింగాయత్ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, జిల్లాప్రచార కమిటీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, కోనాపురం గంగాధర, చెలిమేపల్లి చంద్రశేకర్ తదితరులు నివాళులర్పించారు.

వ్యాధులపై ప్రజలను చైతన్యం చేయాలి



మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తదితరులు

వజ్రకరూరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను చైతన్యం చేయాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సూచించారు.సోమవారం మండలంలోని కొనకొండ్ల పంచాయతీ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా దోమల నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. అనంతరం రూ.20 వేలు విలువ చేసే దోమల నివారణ మందులను పంచాయతీ కార్యదర్శి మురళికి ఎమ్మెల్సీ అందచేశారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్లనాగేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ఉరవకొండ: మండలంలోని నెరిమెట్ల గ్రామంలో ఏడో వార్డు, వజ్రకరూర్ మండలం గూలపాళ్యంలో 8వ వార్డు సభ్యుడి స్థానాలకు నోటిఫికేషన్ జారీ అయిందని అధికారులు తెలిపారు. నెరిమెట్లలో ఎస్సీ జనరల్, గూలపాళ్యం అన్‌రిజర్వడ్ జనరల్‌కు కేటాయించారు. వార్డు సభ్యుల స్థానాలకు మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. ఈనెల 10 వరకూ దరఖాస్తులు స్వీకస్తామన్నారు. ఈ నెల 19న ఎన్నికలు జరుగుతాయన్నారు.

గుమ్మఘట్ట: వార్డు మెంబర్ స్థానాలకు మంగళవారం నుంచి 10వతేదీ వరకూ నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి సోమవారం తెలిపారు. మారెంపల్లి గ్రామంలో 3, కలుగోడు పంచాయతీలో ఐదు వార్డు స్థానాలకు ఎన్నికకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు 12న అప్పీల్, 14న అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు.

కూడేరు: మండలంలోని కలగల్ల పంచాయతీలోని 9వ వార్డు సభ్యుడి ఎంపికకు ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు రిజర్నింగ్ అధికారి(పీఆర్ ఏఈ) శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఈ స్థానాన్ని ఎస్సీ జనరల్‌కు కేటాయించారన్నారు.

తక్షణ సాయం పంపిణీ

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామానికి చెందిన బోయ మల్లికార్జున (45) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం రూ.పది వేల నగదును మృతుడి భార్య కమలమ్మకు సర్పంచ్ కోట్ల ఉమేష్‌రెడ్డి అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పల్లవి, లైన్‌మెన్ రమేష్, కెఎం. రాజు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందజేయండి



మాట్లాడుతున్న ఏడీఏ పద్మజ

ఉరవకొండ: డాక్టర్ వైఎస్సాఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ లలో అనలిస్టులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా కృషి చేయాలని ఉరవకొండ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు పద్మజ సూచించారు. సోమవారం స్థానిక మార్కెట్‌యార్డులోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో జిల్లాలోని ఉరవకొండ, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, శింగనమల్ల నియోజకవర్గాలకు చెందిన ఏఓ, ఏఈఓలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు గతంలో నాసిరకం విత్తనాలు, ఎరువులతో పంటలు సాగుచేసి లక్షలాది రూపాయల పెట్టుబడులు పొగట్టుకోని అప్పుల పాలయ్యేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అగ్రి ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం వల్ల నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందించేందుకు అవకాశం కల్గిందన్నారు. ఉరవకొండ అనలిస్టు షేకన్న మాట్లాడుతూ విత్తనం నాణ్యత, భౌతిక స్వచ్ఛత, తేమశాతం, గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ మంజులత, శ్రీనాథ్‌రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలి



మాట్లాడుతున్న వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి

వజ్రకరూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం ఉరవకొండ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వజ్రకరూరు మండలం పీసీ ప్యాపికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు దూదేకుల వన్నురప్ప, మాబూసాబ్, వలి, పీరావలి, శర్మస్, ఇమామ్‌సాబ్, సోమ్లానాయక్, అర్జున్, రవి, నాగరాజు, గోవిందు, ప్యాపిలి వీరా తదితరులు ప్రణయ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ప్రణయ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు.

బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూముల పరిశీలన

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం వద్ద ఉన్న వైఎస్సార్ క్రాస్ నుంచి పట్టణ పరిధిలోని ఆంజనేయస్వామి లే అవుట్ సమీపం నుంచి కణేకల్లు రోడ్డు, గౌడ లే అవుట్ మీదుగా బళ్లారి రోడ్డులో ఉన్న నరసింహస్వామి స్వాగత తోరణం వరకూ నిర్మించ తలపెట్టిన బైపాస్ రోడ్డు పనులకు సోమవారం తొలి అడుగులు పడ్డాయి. తహసీల్దార్ మారుతి, ఆర్ అండ్ బీ డీఈ రవి శంకర్ రెడ్డి, జేఈ సుజిత బైపాస్ రోడ్డు మ్యాప్‌ను పరిశీలించారు. ల్యాండ్ అక్విజేషన్ కోసం భూములు, సంబంధిత సర్వే నెంబర్లను పరిశీలించారు. మొత్తం రూ.28 కోట్లతో 5.2 కిమీ. మేర నిర్మించే బైపాస్ రోడ్డుకు 37 ఎకరాల భూమి అవసరం అవుతుందని డీఈ తెలిపారు. విప్ కాపు రామచంద్రారెడ్డి సహకారంతో రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేస్తామన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

విడపనకల్లు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, బస్టాండు ఏరియా కాలనీలో మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు సోమవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన రాయదుర్గం మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వంద్రప్ప సోదరుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆంజనేయులు (55) ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా రెడ్‌క్రాస్ సోసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి తదితరులు భౌతికకాయానికి పూలమాలలేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు యంద్రకాయల భీమప్ప, కెనిగుంట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపు

కూడేరు: అర్హత కల్గిన వారందరికీ స్థానిక గ్రామాల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని బ్రాహ్మణపల్లి రెవెన్యూ పొలం సర్వేనంబర్ 11లోని 8 ఎకరాల్లో ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేస్తూ 563 అర్జీలు ఇచ్చారన్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న వారి నివేదికను తయారు చేస్తామన్నారు. మండల కేంద్రంలోని వారికి జోడులింగాల సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద , మిగిలిన వారికి వారి గ్రామాల్లో స్థలాలు కేటాయిస్తామని ఆయన తెలిపారు.

సంక్షిప్త సమాచారం

విద్యుదాఘాతంతో మేకల మృతి

శెట్టూరు: మండలంలోని అయ్యగార్లపల్లిలో విద్యుదాఘాతంతో రెండు మేకలు మృతి చెందాయి. బీసీ కాలనీలో నివాసం ఉంటున్న బోయ పాలయ్యకు చెందిన రెండు మేకలు రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ఎర్త్ పైపు వద్దకు వెళ్లగా.. విద్యుత్ షాక్‌తో మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి.

వాహనాల వేలం రేపు

బొమ్మనహాళ్: అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్ వద్ద వేలం వేస్తామన్నారు.

సర్వేయర్, ఎలక్ట్రిషియన్ కోర్సుకు ఉచిత శిక్షణ

కళ్యాణదుర్గం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(బోరంపల్లి)లో అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ వైఎస్ శ్రీధర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు పది, ఇంటర్ పూర్తి చేసి 17–45 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. వివరాలకు 7673902328 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

మల్బరీ సాగుపై దృష్టి సారించండి

కంబదూరు: మల్బరీ పంటను సాగు చేయడం ద్వారా అధిక లాభాలను సాధించవచ్చని ఏపీఎస్‌ఆర్డీ డైరెక్టర్ డాక్టర్ సీతారాములు, పట్టు పరిశ్రమ శాఖ ఏడీ ఉషవర్ధని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైఎస్సార్ పట్టు–బడి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కదిరిదేవరపల్లిలో మల్బరీ పంటను సాగు చేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఓ నవీన్‌కుమార్, ఏఎస్ఓ ఫిరోజ్‌ఖాన్, టీఏ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

విడపనకల్లు: మండలంలోని మాళాపురం కస్తూరిబా బాలికల పాఠశాలను ఎంపీపీ పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం మెను ప్రకారం ఇవ్వడం లేదని, చాలా అధ్వానంగా ఉంటోందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ రాత్రి పూట ఉండటం లేదన్నారు.దీంతో ప్రిన్సిపాల్ తులసిప్రియపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ప్రవర్తన మారకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు భీంరెడ్డి, మేకల రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

బెళుగుప్ప: మండలంలోని గంగవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆత్మకూరు ఆర్టీటీ క్రీడా మైదానంలో జరుగుతున్న పోటీల్లో ప్రతిభను చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని తేజస్విణి 100 మీటర్లలో మొదటి స్థానం, 400 మీటర్లలో నాలుగో స్థానంలో నిలిచింది. తొమ్మిదో తరగతి విద్యార్థిని సానియా 200 మీటర్లలో మొదటి స్థానం, తొమ్మిదో తరగతి విద్యార్థిని భవ్యశ్రీ షాట్‌పుట్‌లో మూడో స్థానంతో నిలిచింది. ఈనెల 27 నుంచి జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో తేజస్విణి, సానియా పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభను చాటాలని హెచ్ఎం రాజశేఖరరెడ్డి, పీడీ తిమ్మరాజు వారిని అభినందించారు.

సజావుగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

కణేకల్లు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంధ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ రజాక్‌వలీ, వైస్ ఎంపీపీ లీలావతి హాజరయ్యారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ వివిధశాఖల గైర్హాజరు కావడంతో అనేక సమస్యలు చర్చకు రాకుండా పోతున్నాయన్నారు. సమావేశానికి గైర్హాజరైన విద్యుత్‌శాఖ, హెచ్చెల్సీ, ఆర్‌అండ్‌బీ, హార్టికల్చర్ అధికారుల గురించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాల ప్రోగ్రెస్ వివరాలను వెల్లడించిన ఎంపీడీఓ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఎంఈఓ భవానీశంకర్ మాట్లాడుతూ రెండో విడత నాడు– నేడు కింద 37 స్కూళ్లకు రూ.15.17 కోట్లు మంజూరయ్యాయని, పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వైస్ ఎంపీపీ లీలావతి మాట్లాడుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా ప్రజలకు ఉపయోగపడే ముఖ్యమైన సమస్యలపై చర్చించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ గూడెన్న, సీడీపీఓ యల్లమ్మ, ఏఓ శ్రవణ్‌కుమార్, ఏపీఎం గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజెల్ పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ముద్దినాయనపల్లిలో ఉన్న పాఠశాలలు, అంగవాడీ సెంటర్లకు అల్బెండజోల్ మాత్రలను ఎంఈఓ విజయకుమారి, ఎంపీడీఓ సాలమాన్ తదితరులు మెడికల్ ఆఫీసర్ విజయేంద్ర వర్మకు పంపిణీ చేశారు. ఆగస్టు 10న పిల్లలకు ఆల్‌బెండజోల్ పంపిణీ చేస్తామన్నారు. ఈఓఆర్డీ బాలాజీ, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ



గోవిందవాడలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్/విడపనకల్లు/వజ్రకరూరు: గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఇళ్ల వద్దకే పంపిణీ చేయడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి మహిళా పక్షపాతి అని నిరూపించుకున్నారని జెడ్పీటీసీ నీలవేణి అన్నారు. సోమవారం బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకేష్, సర్పంచ్ వన్నూరుస్వామి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే విడపనకల్లు మండలంలోని గడేకల్లు గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రంలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ఎంపీపీ కరణం పుష్పావతి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు సుశీల, ఎంపీటీసీ ఓబుళేసు ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అదేవిధంగా వజ్రకరూరు మండలంలోని చాబాల గ్రామంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ, టీహెచ్‌ఆర్ కిట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సర్పంచు జగదీష్ , గడేహొతూరు వైద్యాధికారి పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కౌడి పీర్ల పెద్ద సరిగెత్తు



ఉరవకొండలో అగ్నిగుండంలో నమాజ్ ఆచరిస్తున్న ముల్లా షఫీవుల్లా

రాయదుర్గంటౌన్: చిన్నమొహర్రం (కౌడి పీర్లు)లో భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వెలసిన పీర్లచావిడిల్లో సోమవారం రాత్రి 9వ రోజు పెద్ద సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా పీర్లమకాన్‌లలో కొలువుదీరిన పీర్లకు ప్రత్యేక పూజలు, పాతేహాలు పఠించారు. అగ్నిగుండాల వద్ద రాత్రంతా తప్పెట్లతో అలాయి ఆడారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఉరువాకిలి వద్ద పీర్ల ఊరేగింపు అనంతరం జలధోత్సవం ఉంటుందని ముజావర్లు తెలిపారు.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, గుమ్మఘట్ట గ్రామాలలో కౌడి పీర్ల వేడుకలను ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లకు చక్కెర,బెల్లంతో చదివింపులు చేయించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

కూడేరు: చిన్న పీర్ల పండగ వేడుకలు కూడేరులో సోమవారం మొదలయ్యాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి పీర్లపెట్టి ఊరేగించారు. ఆదివారం జలధి నిర్వహిస్తామని ముజవార్ తెలిపారు.

కణేకల్లు: పట్టణంలో చిన్నపీర్ల పండుగ ఘనంగా జరిగింది. బస్టాండ్ నుంచి చెరువుకట్ట వరకూ పీర్లను ఊరేగించారు. అనంతరం పీర్లను జలధికి తీసుకెళ్లారు.

ఉరవకొండ: చిన్న సరిగెత్తు ఉత్సవాల్లో భాగంగా ఉరవకొండ పట్టణంలోని 10వ వార్డు/ లో కొలువు తీరిన హుసేన్, హుసేన్ పీర్ల చావిడిలో సోమవారం స్వామి అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండుతున్న అగ్నిగుండంలో పీరుసాబ్ ముల్లాషఫీవుల్లా నమాజ్ ఆచరించడం ఇక్కడ అనవాయితీ. అగ్నిగుండంలో ముల్లాషఫీవుల్లా నమాజ్ ఆచరించడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. అనంతరం భక్తిశ్రద్ధలతో పీర్లను జలధికి తీసుకెళ్లారు.